ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
మంగళవారం 3 సెప్టెంబరు 2024



భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 28.0 కనిష్ఠం : 25.0
తణుకు : 29.0 - 25.0

భయపెడుతున్న కొల్లేరు


అటపాక పక్షుల కేంద్రం వద్ద కొల్లేరులో చేరుతున్న వరద నీరు

కొల్లేరు గ్రామాలకు పొంచి ఉన్న వరద ముప్పు

కోమటిలంకలో రాకపోకలు బంద్... పెరుగుతున్న ఉప్పుటేరు


కోమటిలంకలో పొంగుతున్న కాల్వ


ఏలూరుపాడు వద్ద ఉప్పుటేరుని పరిశీలిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ అధికారులు

కైకలూరు/ మండవల్లి/కలిదిండి/ఏలూరు రూరల్ సెప్టెంబరు 2 : ఎగువన కురిసిన భారీ వర్షాలకు కొల్లేరు ప్రాంతానికి భారీగా వరద నీరు చేరడంతో ప్రమాదం పొంచి ఉంది. ఏలూరు జిల్లా మండవల్లి మండలంలోని పెనుమాకలంక, పెద్దఎడ్లగాడి రహదారి ముంపు బారిన పడింది. విజయవాడ పరిసర ప్రాంతాల్లో ముంపు తీవ్రంగా ఉన్నందున ఆ నీరంతా మరో రెండు రోజుల్లో కొల్లేరు సరస్సులోకి చేరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, నందిగామలంక, శ్రీరామ్‌నగర్, మణుగులూరుకు వరద పొంచి ఉండడంతో కొల్లేరు గ్రామాల్లో ప్రజలు సైతం భయభ్రాంతులకు గురవుతున్నారు. పెద్ద, చిన్నఎడగాడి వద్ద గుర్రపుడెక్క, తూడు, కిక్కిస పెద్దఎత్తున మేట వేసుకుపోవడంతో నీటి ప్రవాహానికి అవరోధంగా మారింది. మరింత వరద నీరు చేరితే నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకపోవడంతో పైగ్రామాలు ముంపు బారిన పడనున్నాయి. మండవల్లి మండలంలోని పెద్దఎడ్లగాడి, చిన్నఎడ్లగాడి వద్ద రహదారి అంచున నీరు తాకుతూ ప్రవహిస్తోంది. కైకలూరు మండలంలో పక్షుల కేంద్రం వద్ద పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తోంది. కోమటిలంక గ్రామ రహదారి కొట్టుకు పోవడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని కొల్లేరు గ్రామాలైన పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోట, లక్ష్మీపురం, గోకర్ణపురం, శృంగవరప్పాడు, గుమ్మళ్ళపాడు గ్రామాలకు ముంపు పొంచి ఉంది. భారీ వర్షాలకు ఎగువ నుండి కొల్లేరులోనికి కొద్దిమేరకు నీరు చేరడంతో అధికారులు కొల్లేరు లంక గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. సోమవారం మండల ప్రత్యేక అధికారి జడ్పీ సీఈవో సుబ్బారావు కొల్లేరు గ్రామాలైన పెంచికలమర్రు, పందిరిపల్లిగూడెం గ్రామాల్లో పర్యటించారు. సర్కారు కాల్వ వద్ద వరదను పరిశీలించారు. పెంచికలమర్రులో జువ్వకనుమల డ్రెయిన్‌ను పరిశీలించారు. ఆయనతో పాటు తహసీల్దార్ ఉదయభాస్కర్, ఎండీవో ఉమామహేశ్వరరావు, వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఏలూరు రూరల్ మండలంలో తమ్మిలేరు మహోగ్రంగా కొల్లేరులోకి పరుగులు తీస్తోంది. కోమటిలంక రహదారిపై వరదనీరు పొంగుతుండడంతో ఆ ప్రాంతవాసులు పడవమీదే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. గతంలో గండిపడిన లింగారావుగూడెం వద్ద ప్రస్తుతం గండిపడకుండా అధికారులు చర్యలు చేపట్టారు. కొల్లేరులోని మందుకోడు, గుడివాకలంక ప్రజలు వరద భయంతో బిక్కు బిక్కుమంటూ ఉన్నారు. కలిదిండి మండలంలో ఉప్పుటేరు నీటి మట్టం పెరుగుతోంది. భారీ వర్షాలు కురుస్తుండడంతో ఎగువన ఉన్న బుడమేరు, తమ్మిలేరులో నీరు కొల్లేరు ద్వారా ఉప్పుటేరులోకి వరద నీరు ప్రవహించడంతో ఉప్పుటేరు ఉధృతంగా ప్రవహిస్తోంది. సున్నంపూడి, దుంపలకోడుదిబ్బ, కొండంగి, మట్టగుంట, పెదలంక గ్రామాల ప్రజలు వరద భయంతో ఉన్నారు. మండల ప్రత్యేకాధికారి భూషణరావు, రెవెన్యూ, డ్రెయినేజీ, ఇరిగేషన్, పంచాయతీ శాఖల అధికారులు ఉప్పుటేరు వెంబడి గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

ఉప్పుటేరు పరిశీలన

కాళ్ళ, సెప్టెంబరు 2 : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉప్పుటేరులో నీటి ప్రవాహానికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి తహసీల్దార్ ఈ.నాగార్జున తెలిపారు. ఏలూరుపాడు వద్ద ఉప్పుటేరును రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఏలూరుపాడు గ్రామాన్ని ఆనుకుని ఉన్న ఉప్పుటేరు బ్రిడ్జి వద్ద నీటి ప్రవాహానికి ఆటంకాలు కలిగించే తూడు, గుర్రపుడెక్క వంటివి ఉన్నాయా లేదా అని పరిశీలించినట్లు తెలిపారు. ఏలూరుపాడు నుంచి కమతవాని గూడెం వరకు ఉప్పుటేరు వెంబడి క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు.

నేడూ పాఠశాలలకు సెలవు

భీమవరం రూరల్, సెప్టెంబరు 2 : రాష్ట్రంలో నెలకొన్న వర్షాలు, వరద పరిస్థితుల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మంగళవారం కూడా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు, అంగన్‌వాడీ సెంటర్లకు సెలవును ప్రకటించినట్టు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. సెలవును అమలు చేయని పాఠశాలలపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ హెచ్చరించారు.

నేడు నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్ రద్దు

నరసాపురం, సెప్టెంబరు 2: నరసాపురం నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌ను మంగళవారం రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. వర్షాల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. ఈ కారణంగా బుధవారం నాగర్‌సోల్ నుంచి నరసాపురం వచ్చే ఎక్స్‌ప్రెస్ కూడా నడవదు. ఈ మేరకు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. మహారాష్ట్ర, తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్నందున దక్షిణ మధ్య రైల్వే చాలా రైళ్లను రద్దు చేసింది. కొన్ని రూట్లు మార్చింది. మరికొన్ని ఆలస్యంగా నడుస్తున్నాయి. రద్దు చేసిన రైలులో నాగర్‌సోల్ కూడా ఉంది.

జిల్లాలో 6,444 ఎకరాల్లో ముంపు

ఆకివీడు రూరల్ సెప్టెంబరు 2 : వరి పొలాల్లో నిలిచి ఉన్న నీటిని బయటకు తోడేయ్యాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) జడ్డు వెంకటేశ్వరరావు అన్నారు. కుప్పనపూడి, అజ్జమూరు గ్రామాలలో వరి పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు చేశారు. పొలాలలో నీటిని తోడేసి తెగుళ్ళ నివారణకు కార్బెండిజిమ్, మాంకోజెల్ కలిసిన సాఫ్ మందును ఎకరానికి 400గ్రాములు చొప్పున పిచికారి చేసుకోవాలని అన్నారు. దీనితోపాటు ఎకరానికి 20కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేసుకోవాలని సూచించారు. జిల్లాలో 6444ఎకరాలలో వరి పొలాలు ముంపు బారిన పడ్డాయని ఆయన తెలిపారు. ముంపు నీరు తగ్గుముఖం పట్టిందని ఆయన తెలిపారు.



గోదావరికి వరద పోటు

ఆచంట, సెప్టెంబరు 2: ఎగువ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు కారణంగా గోదావరికి వరద పెరుగుతున్నది. ఇటీవల వచ్చిన గోదావరి వరద వల్ల లంకలను సైతం ముంచెత్తాయి. ఇపుడిపుడే గోదావరి పూర్తిగా తగ్గి పుష్కరఘాట్‌లు బయట పడి ఉండగా మరలా వరద పోటు ఎత్తడంతో గోదావరి పుష్కరఘాట్‌లను వరద నీరు ముంచుతున్నది.

వరిచేల మునక


యండగండిలో మునిగిన వరిచేలు

ఉండి సెప్టెంబరు 2: భారీ వర్షాలకు యండగండిలో వరిచేలు ముంపుబారిన పడ్డాయి. నాలుగు రోజులుగా కురిసిన వర్షాలకు యనమదుర్రు డ్రెయిన్ ఆనుకుని వున్న చిన్నావాడొడ్డులో వున్న వరిచేలు నీట మునిగాయి. దాంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల రహదారులు పాడయ్యాయి.

మొగల్తూరు: కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని చేలు నీట మునిగాయి. మూడు రోజులుగా సుమారు 108.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. ఫలితంగా మండలంలోని రామన్నపాలెం పంచాయతీ అడవిపర్ర, మొగల్తూరులోని గొల్లగూడెం, ఇంజేటివారిపాలెం, పాలకమ్మ చెరువు తదితర ప్రాంతాల్లో చేలు ముంపునకు గురయ్యాయి. శనివారం మండల వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ నీట మునిగిన చేలను పరిశీలించారు. మండలంలో 436 ఎకరాల్లో వరి నాట్లు వేయగా కురిసిన భారీ వర్షాలకు 150 ఎకరాలు పంట చేలు నీటమునిగాయన్నారు.

వణికిస్తున్న జ్వరాలు

- జిల్లాలో 15 వేల మంది జ్వర పీడితులు
- నెల రోజుల్లో 19 మందికి డెంగీ


తాడేపల్లిగూడెంలో చికిత్సపొందుతున్న జ్వర పీడితులు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 2: జ్వరాలు జిల్లాను వణికిస్తున్నాయి. ఒక పక్క వర్షాలు మరో పక్క అపారిశుధ్యం కలగలిపి ప్రజలు వ్యాధులతో సతమతమవుతున్నారు. జిల్లాలో ఈ నెలలోనే ఏకంగా 15వేల మంది జ్వరపీడితులు ఉన్నట్టు అధికారిక లెక్కలు చెబుతుంటే అది కాకుండా బయట ప్రైవేటు ఆసుపత్రుల్లో వేల సంఖ్యలో జ్వరపీడితులతో కిక్కిరిసి పోతున్నాయి. ఇవిలా ఉంటే నెల రోజుల్లో 19 మంది డెంగీ బారిన పడినట్టు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. 75 మంది టైఫాయిడ్‌తో బాధపడుతున్నట్టు అధికారులు తేల్చారు. ఆహారం, వాతావణం, మంచినీరు, అపారిశుధ్యం అన్ని కలగలిపి ఈ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగిస్తే జ్వరపీడితులు మరింత మంది పెరిగే ప్రమాదం ఉందని వైద్యులు చెబుతున్నారు.

జ్వరాలు, వ్యాధులతో పల్లెలు, పట్నాలు అట్టుడుకుతున్నాయి. ఏ ఇంటిని పలకరించినా ఆ ఇంట్లో కనీసం ఒకరైనా జ్వరపీడితులు తారసపడుతున్నారు. కొన్ని ఇళ్లల్లో అందరూ జ్వరాలతో బాధ పడుతున్నారు. మెడికల్ షాపుల్లో మందులపైనే ఆధారపడి ఇంట్లోనే వైద్యం తీసుకునేవారే అధికంగా ఉన్నారు. దీంతో అధికారికంగా 15వేల మంది జ్వరపీడితులు ఉన్నా వాస్తవంగా ఆలెక్కకు మూడు రెట్లు మించి ఉన్నట్టు అంచనా.

జిల్లా కేంద్రంలో అధిక జ్వరాలు

అధికారికంగా చూపుతున్న జ్వరాల లెక్కల్లో జిల్లాలోనే అత్యధికంగా జిల్లా కేంద్రం భీమవరంలో 1200 కేసులతో టాప్‌లో ఉండగా దాని వెనకాలే పెనుమంట్ర 1100 మంది జ్వరపీడితులతో నిలుస్తోంది. ఇదిలా ఉంటే జిల్లాలో డెంగీ 19 కేసుల్లో అధికారికంగా ల్యాబ్‌ల్లో పాజిటివ్ రాగా వాటిలో తణుకు, పెనుగొండల్లో నాలుగేసి కేసులు నమోదయ్యాయి. టైఫాయిడ్ కేసులు జిల్లాలో 75 నమోదుకాగా తాడేపల్లిగూడెంలో అత్యధికంగా 32 కేసులు నమోదయ్యాయి.

ప్రత్యేక శిబిరాలు తప్పనిసరి

జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో ప్రభుత్వం విరివిగా మెడికల్ క్యాంపులు నిర్వహించి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికే గ్రామాల్లో సర్వేలు చేపడుతున్నా మెడికల్ క్యాంపులు అన్నిరకాల వైద్యులతో ప్రజలకు అవసరమైన మందులతో నిర్వహించాలని ప్రజలు కోరుకుంటున్నారు. పరిశుభ్రమైన వాతావరణం నెలకొల్పాలి.

భీమవరంలో డయాలసిస్ కేంద్రం

- ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు
- ప్రతిపాదించిన ఎమ్మెల్యే అంజిబాబు
- స్థలం చూపిస్తే ఏర్పాటు చేస్తామన్న వైద్యఆరోగ్య శాఖ
- ఆసుపత్రిపైనే రూ. 78 లక్షలతో భవనం ఏర్పాటు
- ఇప్పటికే తాడేపల్లిగూడెం, తణుకులో డయాలసిస్ కేంద్రాలు


భీమవరంలో ప్రభుత్వ ఆస్పత్రి

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

భీమవరంలో కిడ్నీ డయాలసిస్ కేంద్రం ఏర్పాటు కానుంది. స్థానిక ఎమ్మెల్యే అంజిబాబు ప్రభుత్వానికి డయాలసిస్ కేంద్రంపై ప్రతిపాదించారు. అందుకు సహకరించాలని కోరారు. స్థలం చూపిస్తే తామే యూనిట్ నెలకొల్పుతామంటూ వైద్య ఆరోగ్యశాఖ ముందుకొచ్చింది. దాంతో భీమవరం ప్రభుత్వ ఆసుపత్రిపైనే కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇదివరకే విజయవాడ నుంచి వైద్య ఆరోగ్యశాఖ నిపుణుల బృందం ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించింది. డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు అనుకూలంగా ఉందంటూ గుర్తించింది. భవన నిర్మాణంపై ఇప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. ఎమ్మెల్యే అంజిబాబు, ఇంకొందరు దాతలు రూ.78 లక్షలు సమకూర్చారు. ఆ మొత్తంతో డయాలసిస్ కేంద్రం నిర్మించనున్నారు, అందులో ప్రభుత్వం 10 యూనిట్‌లు ఏర్పాటు చేయనుంది. అంటే ఒక సిటింగ్‌లో 10 మంది కిడ్నీ బాధితులు డయాలసిస్ చేసుకునే అవకాశం ఉంది. ఇప్పటిదాకా భీమవరం ప్రాంతం నుంచి బాధితులంతా డయాలసిస్‌కోసం తాడేపల్లిగూడెం, తణుకు ప్రభుత్వ ఆసుపత్రులకు వెళుతున్నారు. గతంలో విజయవాడ వెళ్లాల్సి వచ్చేది. తాడేపల్లిగూడెం, తణుకులో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసిన తర్వాత ఉచితంగా సేవలు పొందుతున్నారు. ఎంతోమంది కిడ్నీ బాధితులు కోలుకుంటున్నారు. జిల్లా కేంద్రమైన భీమవరంలో డయాలసిస్ కేంద్రం లేదు. ప్రైవేటు ఆసుపత్రులు అధికంగా ఉన్నాయి. ప్రైవేటు ఆసుపత్రుల్లో డయాలసిస్ చేసుకోవాలంటే ఖర్చుతో కూడుకున్న పని. దాంతో భీమవరంలో ఉచిత డయాలసిస్ కేంద్రానికి ఎమ్మెల్యే అంజిబాబు చొరవ చూపారు. డెల్టా ప్రజలకు ఇది ఎంతగానో ఉపయోగపడనుంది.

కొబ్బరికి ఆకుతేలు తెగులు


తెగులు సోకిన కొబ్బరి చెట్లు

ఇటీవల శ్రావణ మాసం సందర్భంగా కొబ్బరి ధరలు ఆశాజనకంగా ఉన్నప్పటికీ దిగుబడి తగ్గడం, మరో వైపు కొబ్బరి చెట్లకు తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కాపవరం గ్రామ ప్రాంతంలో గల రొయ్యల చెరువుల గట్లపై సుమారు 400 కొబ్బరి చెట్లకు ఆకుతేలు తెగులు సోకింది. ఈతెగులు సోకిన కొబ్బరి చెట్లకు ఉన్న పచ్చటి ఆకులు అన్ని అగ్నిప్రమాదాల్లో దగ్ధమైనట్లు పూర్తిగా ఆకులను పురుగులు తినివేయగా, కొబ్బరి ఆకుల్లోని ఈనెలు కాండం మాత్రమే కనిపిస్తున్నాయి.

- దగ్ధమైనట్లు కనిపిస్తున్న కొబ్బరి ఆకులు
- డెల్టాలో రొయ్యల చెరువుల ప్రాంతాల్లో అధికం
- అధిక తేమ వల్లనే అంటున్నఉద్యాన వన శాఖాధికారులు

పాలకొల్లు, సెప్టెంబరు 2 : రొయ్యల సాగు చేస్తున్న ప్రాంతాలలో కొబ్బరి చెట్లకు ఈతెగులు అధికంగా కనిపిస్తోంది. ఆప్రాంతాలలో తేమ అధికంగా ఉండటం కారణంగా ఆకు తేలు తెగులును వ్యాప్తి చేసే కీటకాలు త్వరితంగా అభివృద్ధి చెంది కొబ్బరి చెట్ల ఆకులపైదాడి చేస్తున్నాయి. కొబ్బరి ఆకులలో కేవలం కొబ్బరి ఈనెలు మాత్రమే కనిపిస్తుండగా, పచ్చటి ఆకుల్లో ఉన్న రసాన్ని కీటకాలుపీల్చి వేయడంతో అగ్నికి ఆహుతి అయినట్టుగా ఆకులు కనిపిస్తున్నాయి. ఆకు తేలు తెగులు సోకిన చెట్లుకు దిగుబడి గణనీయంగా తగ్గిపోతున్నది. ఆయా చెట్లు పూర్వ స్థితికి రావాలంటే సుమారు ఏడాది కాలం పట్టడంతో పాటు కొబ్బరి దిగుబడి పెరగడానికి అధిక సమయం పడుతుందని ఉద్యానవన శాఖాధికారులు చెబుతున్నారు

- పశ్చిమడెల్టాలో ఇప్పటికే కొబ్బరి దిగుబడి మూడింట ఒక వంతు తగ్గింది. ఇప్పుడు శ్రావణ మాసం, వినాయకచవితి ఉత్సవాలు నేపథ్యంలో కొబ్బరి వినియోగం పెరగనుంది. అయితే రైతులకు ఆశించిన స్థాయిలో కొబ్బరి దిగుబడి రావడంలేదు. దిగుబడి తగ్గినప్పటికీ కొబ్బరి దింపు ఖర్చులు, కూలీల ఖర్చులు, ట్రాన్స్‌పోర్టు ఖర్చులు కలిపి తడిసి మోపెడు కావడంతో వచ్చిన ఆదాయంలో 50శాతంపైగా ఖర్చులకే పోతున్నాయని, రైతులు చెబుతున్నారు

ఆకు తేలు నివారణ

కొబ్బరి చెట్లకు పట్టిన ఆకు తేలు తెగులు నివారణకు క్రిమి సంహారక మందు మోనోక్రోటోఫాస్ వినియోగించాలని ఉద్యాన వన శాఖాధికారులు సూచిస్తున్నారు. 10ఎంఎల్ మోనోక్రోటోఫాస్‌ను 10ఎంఎల్ నీటిలో కలిసి మిశ్రమాన్ని పాలథిన్ కవర్‌లో తీసుకుని కొబ్బరి చెట్టు వేరుకు కట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ఈవిధంగా చేయడంద్వారా ఆకు తేలు తెగులు నివారణ అవుతుందని, చెట్లు త్వరితంగా కోలుకుంటాయని అధికారులు తెలిపారు. అయితే క్రిమిసంహారక మందు కొబ్బరి వేళ్ళకు కట్టిన చెట్టు నుంచి 45 రోజుల పాటు కొబ్బరి కాయలు దింపుతీయకూడదని సూచించారు. అనంతరం కొబ్బరిని వినియోగించుకోవచ్చు. సంబదిత అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఉద్యాన రైతులకు తగిన సూచనలు ఇవ్వాలని, ప్రభుత్వం నేరుగా క్రిమి సంహారక మందులు, ఎరువులు కొబ్బరి రైతులకు ఉచితంగా ఇవ్వాలని కోరుతున్నారు.

రొయ్యలు ఉక్కిరి బిక్కిరి

ఉండి సెప్టెంబరు 2: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలు, ఉష్ణోగ్రతల ప్రభావం వలన చేపలు, రొయ్యల చెరువులలో పీహెచ్ అధికమవ్వడం, ఆక్సిజన్ లోపం, అమ్మోనియం, హెచ్2ఎస్ వంటి కారణాలతో చేపలు, రొయ్యలకు వ్యాధులు సోకి చనిపోతున్నాయి. ప్రధానంగా పెద్దసైజు చేపలు శంఖుజలగ బ్యాక్టీరియాతో చేపలు ఎక్కువగా చనిపోతాయి. ముందుగానే చెరువు నీటిని పరి రక్షించుకుని నీటి ఆక్సిజన్ స్థాయి 5 పీపీఎం కన్నా తక్కువగా వున్నట్లు గుర్తిస్తే వెంటనే ఏరియేటర్లు లేదా రీసర్క్యులేషన్ చెరువు నీటిని చెరువులోకి నింపడం లేదా బోటు తిప్పడం వంటి పనులను రాత్రి 10గంటలు నుంచి ఉదయం ఎండ వచ్చే వరకు ఏర్పాటు చేసుకోవాలి. శంఖుజలగ వ్యాధులున్నట్లు గమనిస్తే పొటాషియం పర్మాంగనేట్ ఎకరానికి అరకేజీ నుంచి 1కేజీ వరకు తెల్లవారు జామున చెరువునీటిలో చల్లుకోవాలి. సాయంత్రం పూట జియోలైటు ఎకరానికి 10కేజీలు, గేనోసెక్స్, ముక్క కలిగిన పౌడర్‌ను పావుకేజీ ఎకరానికి అమ్మోనియం తగ్గడానికి చల్లుకోవాలి. వర్షం పడితే అగ్రికల్చరల్ లైమ్ ఎకరానికి 30కేజీలు చల్లుకోవాలి. మేతలు గమనించి తక్కువగా ఇవ్వాలి. వారానికి ఒకరోజు మేత ఇవ్వడం మానేస్తే మంచిదని కృషి విజ్ఞాన కేంద్రం ఫిషరీస్ శాస్త్రవేత్త డా.ఎ.శ్రీనివాసరావు సూచించారు. ఏవిధమైన రసాయనాలు, ఎరువులు వాడవద్దంటూ సూచించారు.



ఆపన్న హస్తం

వరద బాధితులకు ఆహార పొట్లాలు, పాలు, వాటర్ ప్యాకెట్లు


తాడేపల్లిగూడెం నుంచి తరలిస్తున్న ఆహార పొట్లాలు

రేపు హార్టీకల్చర్ డిప్లొమా మాన్యువల్ కౌన్సెలింగ్

ఆపన్నహస్తం

» వరద బాధితుల కోసం ఆహార పొట్లాలు, పాలు, వాటర్ ప్యాకెట్లు
» పారిశుధ్య కార్మికులు, బోట్లు తరలింపు » ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి భారీగా సాయం

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో ఉభయ గోదావరి జిల్లాల యంత్రాంగం విజయవాడ వరద బాధితులకు సాయం అందించడానికి ముందుకొచ్చింది. ఆహార పదార్థాలతో పాటు బోట్లను పంపించారు. విద్యుత్ ఉపకరణాలను మరమ్మతులు చేయడానికి ఇక్కడ నుంచి రెస్క్యూ టీంలు, పారిశుధ్యం మెరుగుపరచడానికి పారిశుధ్య కార్మికులను తరలించారు.



ఆహార పదార్థాలను తనిఖీచేస్తున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం టౌన్, సెప్టెంబరు 2 : పశ్చిమ గోదావరి జిల్లా నుంచి విజయవాడకు 50 వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిళ్లను తరలించామని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఆదివారం రాత్రి నుంచి జిల్లాలోని 15 ప్రాంతాలలో ఆహార పొట్లాలను సిద్ధం చేసి సోమవారం ఉదయం విజయవాడకు పంపడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. భీమవరం విష్ణు కాలేజీ, ప్రైవేట్ హోటల్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలను, ప్యాకింగ్, రవాణా తదితర విషయాలను కలెక్టర్ దగ్గర ఉండి స్వయంగా పరిశీలించారు. జిల్లాలోని భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెంలలోని వివిధ ప్రాంతాల్లో ఆహారాన్ని తయారు చేయించి 50 వేల ఆహార పొట్లాలు, వాటర్ బాటిల్స్ వాటర్ ప్యాకెట్లు 50 వేల చొప్పున, లక్షా 14 వేల 50 బిస్కెట్ ప్యాకెట్లను 14 వాహనాల్లో విజయవాడకు పంపామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మరిన్ని ఆహార పొట్లాలను సరఫరా చేయాల్సి వస్తే అధికారులను, సిబ్బందిని సిద్ధంగా ఉండాలని ఆదేశించామన్నారు. గోదావరి విద్యా వికాస్ చైతన్య సొసైటీ, భారతి విద్యా భవన్ ఆవరణలోను, తాడేపల్లిగూడెం ప్రైవేటు హోటల్స్‌లో తయారు చేస్తున్న ఆహార పదార్థాలను సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి స్వయంగా పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి ఆర్డీవో బి.శివన్నారాయణ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి, భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, తాడేపల్లిగూడెం తహసీల్దార్, ఎం.అనిల్ కుమార్, డీటీ రవిశంకర్, మధ్యాహ్న భోజన పథకం కో ఆర్డినేటర్ కృష్ణారావు, సోమేశ్వరరావు, భారతి విద్యా భవన్ స్కూల్ ఏవో యూఆర్‌కే రాజు, విద్యా కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.



ఆహార పదార్థాల తయారీపై ఆరా తీస్తున్న జేసీ రాహుల్ రెడ్డి, డీఈవో నాగమణి

ఏలూరు సిటీ/ఏలూరు టూ టౌన్, సెప్టెంబరు 2 : జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆహార పదార్థాలను సోమవారం ఉదయం, సాయంత్రం విజయవాడకు తరలించారు. మొత్తం లక్షా 25 వేల ఆహార ప్యాకెట్లు, లక్షా 20 వేల పాల ప్యాకెట్లు, లక్ష బిస్కట్ ప్యాకెట్లు, 30 వేల బ్రెడ్ ప్యా కెట్లు, రెండు లక్షల వాటర్ ప్యాకెట్లు , 50 వేల కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలను రోడ్డు మార్గాన విజయవాడకు వాహనాలలో తరలించారు. ఉదయం ఏలూరులోని గోకుల్ కల్యాణ మండపం, ఇతర కేటరింగ్‌ల వద్ద, సాయంత్రం పత్తేబాదలో ఉండవల్లి అపార్టుమెంట్‌లో యుద్ధ ప్రాతిపదికన ఆహార పదార్థాలను జిల్లా యంత్రాంగం తయారు చేయించింది. గోకుల్ కల్యాణ మండపంలో ఆహార పదార్థాల తయారీని కలెక్టర్ కె.వెట్రిసెల్వి స్వయంగా పరిశీలించారు. ఆహార తయారీకి ఉపయోగించే కాయగూరలు, బియ్యం, తదితర వస్తువుల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ఆహార తయారీ అనంతరం జిల్లా అధికారులతో కలిసి రుచిచూసి కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఆహార తయారీ నుంచి ప్యాకింగ్ వరకు ఎక్కడా ఎటువంటి పొర పాట్లు జరగకుండా ఉండేందుకు జిల్లా అధికారులు స్వయంగా పర్యవేక్షించాలని కలెక్టర్ ఆదేశి ంచారు. కలెక్టర్ ఆదేశాలతో జేసీ ధాత్రిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ విజయరాజు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సత్యనారాయణ, ఆర్డీవో ఖాజావలి, ఏలూరు కమిషనర్ భానుప్రతాప్, గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్ , ఏలూరు తహసీల్దార్ శేషగిరి, ఏలూరు నగర పాలక అధికారులు ఆహార పదార్థాల తయారీని దగ్గరుండి పర్యవేక్షించారు. ఇక పాలప్యాకెట్ల రవాణాను జిల్లా పంచాయతీశాఖాధికారి శ్రీనివాస్ విశ్వనాథ్ స్వయంగా పర్యవేక్షించారు. విజయవాడలో పారిశుధ్య పనులు చేసేం దుకు ఏలూరు నగర పాలక సంస్థలో పని చేస్తున్న 150 మంది పారిశుధ్య కార్మికులను తరలించారు. శ్రీసత్యసాయి సేవా ట్రస్టు ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు, పది వేల వాటర్ ప్యాకెట్ల మినీ వ్యానుకు ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ జెండా ఊపి ప్రారంభించారు. ఎమ్మెల్యే బడేటి చంటి ఆదేశాలతో భోజనాలు తయారు చేసి పంపుతున్నామని నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. ఆహారపదార్థాల లారీని మేయర్ దంపతులు జెండా ఊపి ప్రారంభించారు. నగర కమిషనర్ భానుప్రతాప్, అడిషనల్ కమిషనర్ సీహెచ్ చంద్రయ్య దగ్గరుండి ఏర్పాట్లు చేశారని అన్నారు. రెవెన్యూ, మెప్మా సిబ్బంది, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్ సిబ్బంది ఆహార పొట్లాల ప్యాకింగ్‌లో పాల్గొన్నారు.



ఆహార పదార్థాల పార్శిళ్లను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి



విజయవాడకు మందుల కిట్లు పార్సిల్ చేస్తున్న కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టులు

బెజవాడకు భీమవరం మందులు

భీమవరం క్రైం, సెప్టెంబరు 2 : బెజవాడ నగరంపై బుడమేరు విరుచుకుపడడంతో లక్షలాది మంది వరద ముంపులో విలవిల్లాడుతున్నారు. దీంతో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ వేగంగా స్పందించారు. అత్యవసర మందుల కిట్లును రాత్రికి రాత్రి సిద్ధం చేసి తెల్లవారేసరికి బెజవాడ విమానాశ్రయానికి చేర్చి ఉన్నతాధికారులకు అందజేశారు. వరద బాధితకులకు మందులు పంపించాలని ఉన్నతాధికారులు నుంచి ఆదివారం రాత్రి సమాచారం అందడంతో జిల్లా డ్రగ్ కంట్రోల్ ఆఫీసర్ ఆబిబ్ ఆలీషేక్ అప్రమత్తమయ్యారు. భీమవరం డ్రగ్ అండ్ కెమిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులకు రాత్రి 12 గంటల సమయంలో విషయం తెలియజేశారు. దీంతో అసోసియేషన్ సభ్యులు అర్ధరాత్రి మందులు, సిరప్స్ ఓఆర్ఎస్ ప్యాకెట్లతో 2,500 కిట్లు సిద్ధం చేశారు. సోమవారం తెల్లవారేసరికి బెజవాడ ఎయిర్ పోర్టుకు పంపించి రాష్ట్రంలోనే తొలిగా మందులు పంపినందుకు అభినందనలు అందుకున్నారు.

నరసాపురం నుంచి వెయ్యి కిట్లు

నరసాపురం టౌన్: నరసాపురం మెడికల్ అసోసియేషన్ తమ వంతు సాయంగా సుమారు రూ. 50 వేలు విలువ చేసే వెయ్యి మందుల కిట్‌లను పంపిణీ చేసింది. వీటిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లతో పాటు అత్యవసర మందులు, జ్వరం, డయారియా, ఇతర యాంటీ బైయోటిక్స్ మందులున్నాయి. సంఘం అధ్యక్షుడు చెన్నంశెట్టి నాగు ఆధ్వర్యం లో అన్ని షాపుల నుంచి మందుల్ని సేకరించారు. వాటిని బాక్స్‌లో పెట్టి విజయవాడ పంపించారు. డ్రగ్ ఇనస్పెక్టర్ మల్లిఖార్జునరావు, పి.సత్తిబాబు, కె.నాగబాబు, జి.సూరిబాబు, సీతరామరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు నుంచి 2,500 కిట్లు

ఏలూరు రూరల్ : ఏలూరు కెమిస్ట్, డ్రగిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగిస్ట్, ఏలూరు కెమిస్ట్, డ్రగిస్ట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అత్యవసర మందుల కిట్‌లను సోమవారం విజయవాడ పంపించారు. సుమారు 2,500 కిట్లు, మందులు వేసుకునే విధానాన్ని కరపత్రాలు ముద్రించి కార్గో ద్వారా వరద రిలీఫ్ ఫండ్‌కు పంపించినట్లు అధ్యక్షుడు రవిచంద్ర తెలిపారు. మందులతో వెళుతున్న వాహనాన్ని ఆయన ప్రారంభించారు. ఉపాధ్యక్షులు కె.కిషోర్, కార్యదర్శి సయ్యద్ బాజీద్, కోశాధికారి ఎం.వెంకట్రావు, కె.రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



నరసాపురంలో మందుల కిట్‌లను పంపిణీ చేస్తున్న మెడికల్ అసోసియేషన్

విజయవాడకు విద్యుత్ రెస్క్యూ టీంలు

ఏలూరుసిటీ, సెప్టెంబరు 2: విజయవాడలో వరద బాధిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను మెరుగుపరచటానికి ఏలూరు విద్యుత్ సర్కిల్ (ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా) నుంచి 30 టీమ్‌లు విజయవాడకు తరలి వెళ్లాయని విద్యుత్ శాఖ చెబుతోంది. ఆ శాఖ సీఎండీ ఆదేశాల మేరకు ఈ జిల్లాలోని 217 మంది సభ్యులు ఈ టీంలలో ఉన్నారని విద్యుత్ శాఖ పేర్కొంది. వరద బాధిత ప్రాంతాల్లో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సరఫరా మెరుగుపరచటానికి చర్యలు చేపడతారు. విరిగి పోయిన విద్యుత్ స్తంభాలను స్థానే మరొకటి వేయడం, వీధి లైట్లను ఏర్పాటు చేయడం, దెబ్బతిన్న ట్రాన్స్ ఫార్మర్లను మార్పు చేయర్పడం, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను మార్పు చేయటం వంటి పనులను ఈ రెస్క్యూ టీం చేపడుతుందని, పూర్తిగా విద్యుత్ సరఫరాను మెరుగుపరిచే వరకు రెస్క్యూ టీంలు అక్కడ పని చేస్తాయని చెబుతున్నారు.

150 మంది పారిశుధ్య కార్మికులు, 22 బోట్లు తరలింపు

ఏలూరు సిటీ, సెప్టెంబరు 2 : కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు జిల్లా మత్స్య శాఖాధికారులు ఎన్టీఆర్ జిల్లాకు ఏలూరు జిల్లా నుంచి 22 బోట్లను పంపించారు. కలిదిండి నుంచి 15, కైకలూరు నుంచి ఐదు, పట్టిసీమ ఫెర్రీ నుంచి రెండు పడవలు ఎన్టీఆర్ జిల్లాకు తరలించినట్లు జిల్లా మత్స్యశాఖాధికారి నాగలింగాచారి తెలిపారు. ఈ బోట్లలో 20 దేశీయ పడవలు, 2 ఫైబర్ బోట్లు ఉన్నాయి. విజయవాడకు పారిశుధ్య పనులు చేసేందుకు ఏలూరు నగర పాలక సంస్థలో పని చేస్తున్న 150 మంది పారిశుధ్య కార్మికులను విజయవాడకు తరలించినట్లు నగర కమిషనర్ ఎ.భానుప్రతాప్ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీల నుంచి విజయవాడ కు పారిశుధ్య కార్మికులను తరలిస్తున్న క్రమంలో భాగంగా ఏలూరు నుంచి కూడా పారిశుధ్య కార్మికులను పంపించామని తెలిపారు.



పోలవరం నుంచి పడవలు తరలిస్తున్న రెవెన్యూ సిబ్బంది



ద్వారకాతిరుమల ఆహార పొట్లాల తయారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి



ఆహారాన్ని తయారు చేయిస్తున్న ఏలూరు మేయర్ నూర్జహాన్



జంగారెడ్డిగూడెంలో వంటల తీరును పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి



ఏలూరు నుంచి విజయవాడకు సిద్ధమైన ఆహార పదార్థాల వ్యాన్



ఏలూరులో వ్యానుకు జెండా ఊపుతున్న ఎస్పీ కిశోర్

మేమున్నామంటూ..

ద్వారకాతిరుమల , సెప్టెంబరు 2 : చినవెంకన్న ఆలయం నుంచి 15 వేల ఆహార పొట్లాలను, మంచినీటి ప్యాకెట్లను గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఆధ్వర్యంలో రెండు విడతలుగా సోమవారం సాయంత్రం పంపించారు. ఇందు నిమిత్తం అయిన ఖర్చు ఆలయ ఉద్యోగుల ఒకరోజు జీతం సుమారు రూ. మూడు లక్షలను జమ చేసినట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. దేవస్థానం అంబరఖానాలో ముందుగా ఐదు వేల పొట్లాలు, ఆ తరువాత మరో 10 వేల పొట్లాలను పంపించినట్లు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు వివరించారు.

● పాలకొల్లు అర్బన్ : స్థానిక శ్రీక్షీరా రామలింగేశ్వర స్వామి దేవస్థానం నుంచి రెండు వేలు, రేపాక వారి సత్రం నుంచి వెయ్యి ఆహార పొట్లాలను విజయవాడకు పంపించినట్టు దేవస్థానం ఈవో శ్రీనివాసరావు, సత్రం ఫ్యామిలి ఫౌండర్ మెంబర్, చైర్మన్ రేపాక శ్రీనివాసరావు తెలిపారు.

● జంగారెడ్డిగూడెం : జేసీ ధాత్రి రెడ్డి ఆదేశాల మేరకు ఆహార పదార్థాలను మెప్మా మహిళల సహకారంతో పార్శిల్ చేయించి మినీ వ్యాన్‌లలో విజయవాడ పంపిచామని తహసీల్దార్ కె.స్లీవజోజి తెలిపారు. జేసీ ధాత్రి రెడ్డి వంటల తీరును పరిశీలించారు. మున్సిపల్ కమిషనర్, ఐటీడీఏ ఈఈ రాంబాబు, ఎంపీడీఓ కేవీ ప్రసాద్, సీఎస్‌డీటీ వైవీ లక్ష్మీకుమారి, డిప్యూటీ తహసీల్దార్ కె.రమేష్ తదితలు సహకరించారు. అలాగే స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వ్యాపారస్తుల వద్ద సేకరించిన రూ.లక్షన్నర విలువ చేసే నిత్యావసర సరుకులను విజయవాడకు పంపారు. డీఎస్పీ రవిచంద్ర, యు.గంగాధర్, బలరాం రాంబాబు, బాపిరాజు, ఎస్.శ్రీనివాసరావు, వసంత్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

ఏలూరు అర్బన్/బుట్టాయగూడెం, సెప్టెంబరు 2 : ఏలూరు సత్రంపాడులోని ప్రభుత్వ ఐటీఐలో, బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సిడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఘంటా సుధాకర్ తెలిపారు.

రైళ్లు రద్దు.. దారి మళ్లింపు

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 2 : భారీ వర్షాలకు రైల్వే ట్రాక్‌లు దెబ్బతిడంతో ఏలూరు మీదుగా వెళ్లే 15 రైళ్లను ఈ నెల మూడున రద్దు చేశారు. మరి కొన్నింటిని నాలుగో తేదీన రద్దు చేసినట్టు విజయవాడ సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు తెలిపారు.

రద్దయిన రైళ్లు

12806 లింగంపల్లి - విశాఖపట్టణం 3వ తేదీన రద్దు
17016 సికింద్రాబాద్ - భువనేశ్వర్ 3వ తేదీ వరకు రద్దు,(ఏలూరులో 4వ తేదీ)
07165 హైదరాబాద్ - కటక్ 3వ తేదీ వరకు రద్దు (ఏలూరులో 4వ తేదీ)
07166 కటక్ - హైదరాబాద్ 4వ తేదీ వరకు రద్దు (ఏలూరులో 5వ తేదీ)
12703 హౌరా - సికింద్రాబాద్ 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22863 హౌరా - ఎస్ఎంవీటీ బెంగళూరు 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
12740 సికింద్రాబాద్ - విశాఖపట్టణం 3వ తేదీ రద్దు
18189 టాటానగర్ - యర్నాకుళం 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22605 పునలియా - తిరునెల్వెల్లి 2వ తేదీ రద్దు (ఏలూరులో 4వ తేదీ)
12841 షాలిమార్ - చెన్నై సెంట్రల్ 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
06082 షాలిమార్ - కొచ్చివెల్లి 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
12665 హౌరా - కన్యాకుమారి 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22841 సత్రగంజి - తామ్రం 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22837 అట్టాయ్ - యర్నాకుళం 2వ తేదీ రద్దు (ఏలూరులో 3వ తేదీ)
22860 చెన్నై సెంట్రల్ - పూరీ 2,3 తేదీలలో రద్దు (ఏలూరులో 4వ తేదీ)
12862 మహబూబ్‌నగర్ - విశాఖపట్టణం 3వ తేదీ రద్దు (ఏలూరులో 4వ తేదీ)
12861 విశాఖపట్టణం - మహబూబ్‌నగర్ 3వ తేదీ రద్దు
08584 తిరుపతి - విశాఖపట్టణం 3వ తేదీ రద్దు (ఏలూరులో 4వ తేదీ)

దారి మళ్లించిన రైళ్లు

18046 హైదరాబాద్-షాలిమార్ సికింద్రాబాద్ నుంచి పగిడిపల్లి, గుంటూరు, కృష్ణాకెనాల్, విజయవాడకు చేరుకుంటుంది.
12737 కాకినాడ పోర్టు-లింగంపల్లి విజయవాడ, గుంటూరు, పగిడిపల్లి, సికింద్రాబాద్ మీదుగా వెళ్తుంది.
12738 లింగంపల్లి-కాకినాడ పోర్టు, సికింద్రాబాద్, పగిడిపల్లి, గుంటూరు, విజయవాడగా వస్తుంది.
16093 చెన్నై సెంట్రల్-లక్నో విజయవాడ, దువ్వాడ, విజయనగరం, రాయగడ, టిట్లాఘర్, నాగపూర్ మీదుగా వెళ్తుంది.
12651 మధురై-హజరత్ నిజాముద్దీన్, విజయవాడ, దువ్వాడ, విజయనగరం, రాయగడ, టిట్లఘర్, రాయపూర్, నాగపూర్ మీదుగా వెళ్తుంది.

ట్రిపుల్ ఐటీ ఫుడ్ కాంట్రాక్టర్లపై కేసు

నూజివీడు, సెప్టెంబరు 2: ఏలూరు జిల్లా నూజివీడు ట్రిపుల్ ఐటీ ఫుడ్ కాంట్రాక్టర్లపై సోమవారం కేసు నమోదైంది. ఐదు రోజులుగా ట్రిపుల్ ఐటీలోని రెండు మెస్సుల్లో నాసిరకం ఆహారం విద్యార్థులకు అందించటం, మెస్‌ల పరిస్థితిపై వరుస కథనాలు రావడంతో స్పందించిన మంత్రి నారాలోకేశ్ విచారణ కమిటీని నియమించారు. కమిటీ నివేదికతో ఆయన ఫుడ్ కాంట్రాక్టర్ల పై కేసు నమోదు చేయాలని నూజివీడు ట్రిపుల్ ఐటీ అధికారులను ఆదేశించారు. ఈ ఇద్దరు కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. కొత్త కాంట్రాక్టర్లను నియమించే వరకు ఈ ఐటీలోనే మూడో మెస్ నడుపుతున్న కేఎంకే కేటరింగ్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. కొత్త టెండర్ల ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని అధికారులకు మంత్రి సూచించారు. దీంతో ఫైన్ క్యాటరర్స్ అండ్ సప్లయిర్స్ మేనేజింగ్ పార్టనర్ ఘోష్, అనూష హాస్పిటాలిటీ సర్వీసెస్ ఎండీ పి.వెంకట నారాయణపైన ట్రిపుల్ ఐటీ అధి కారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అజ్ఞాతంలోకి నిర్వాహకులు

మెస్ భోజన అంశంలో ఆరోపణల అనంతరం పరిస్థితిని చక్కదిద్దేందుకు నూజివీడు వచ్చిన ఫైన్ కేటరర్స్ నిర్వాహకుడు ఘోష్ కేసు నమోదు అనంతరం అజ్ఞాతంలోకి వెళ్ళినట్లు సమాచారం. ప్రభుత్వం మెస్ నిర్వహణల తీరుపై సీరియస్‌గా ఉన్న దృష్ట్యా నిర్వాహకులపై నమోదు అయిన కేసు విషయంలో వారు స్టే ద్వారా అరెస్ట్ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లుగా వినికిడి.

కమిటీ సిఫార్సులు

ఆహార నాణ్యత పర్యవేక్షణకు స్టూడెంట్ మెస్ కమిటీని నియమించి, స్టాల్స్, భోజన ప్రాంతం, వంటగది ప్రాంతాలను విద్యార్థులతో కూడిన మరో మెస్ కమిటీని నియ మించి పర్యవేక్షించాలి. ప్రతి డైనింగ్ హాల్లోనూ ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలి. ఆహార తనిఖీ కోసం ఇద్దరు ఫుడ్ సేఫ్టీ తనిఖీ అధికారులను నియమించాలని సిఫార్సు చేసినట్లు సమాచారం.

రేపు హార్టీకల్చర్ డిప్లొమా మాన్యువల్ కౌన్సిలింగ్

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 2: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ పరిధిలోని గుర్తింపు పొందిన నాలుగు డిప్లమో కళాశాలలో మాన్యువల్ కౌన్సిలింగ్ బుధవారం నిర్వహించనున్నట్టు రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు తెలిపారు. పదోతరతి ఉత్తీర్ణత సాధించి ఇప్పటి వరకూ డిప్లొమా కోర్సుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బుధవారం వెంకట్రామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయ మీటింగ్ హాల్‌లో ఈ మాన్యువల్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు పదో తరగతి మార్కుల మెమో, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని వారు రూ.800 మాన్యువల్ ఫీజు, బదిలి సర్టిఫికెట్స్, నాలుగు నుంచి 10వ తరగతి వరకూ స్టడీసర్టిఫికెట్స్, గేమ్స్, ఎన్‌సీసీ, సీఏపీ, పీహెచ్ తదతర సర్టిఫికెట్‌లు ఉంటే ఒరిజినల్స్ తీసుకురావాల్సి ఉంటుందని వివరించారు.

నారాయణపురం డిగ్రీ కళాశాలలో నాక్ బృందం పర్యటన



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న నాక్ బృందం

ఉంగుటూరు, సెప్టెంబరు 2 : మండలంలోని నారాయణపురం శ్రీఅరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నాక్ పీర్ బృందం పర్యటించింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సర్పంచ్ దిడ్ల అలకనంద, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి స్వాగతం పలికారు. నాక్ బృందంలో మధ్య ప్రదేశ్‌కు చెందిన అమితాబ్ సక్సేనా, ప్రొఫెసర్ ఎన్‌వీఆర్ జ్యోతి కుమార్, డాక్టర్ మీనాక్షి వాకోలే, రీజినల్ డైరెక్టర్ శోభారాణి, ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు, అధ్యాపక బృందం పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు ఈపూరి సత్యనారాయణ, ఆదిరెడ్డి సత్యనారాయణ, బొమ్మిడి అప్పారావు, యెలిశెట్టి పాపారావు బాబ్జి పాల్గొన్నారు. నాక్ పీర్ కమిటీ కళాశాల ప్రాంగణంతో పాటు జేకేసీ సెంటర్‌ను సందర్శించి కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

క్రైం కార్నర్

బిల్డింగ్‌పై నుంచి పడి కార్మికుడి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 2 : తాపీ పనికి వెళ్ళిన ఒక కార్మికుడు ప్రమాదవశాత్తు బిల్డింగ్‌పై నుంచి పడి మృతి చెందాడు. గుంటూరుకు చెందిన వెంకటేశ్వరరావు 20 ఏళ్లగా పోణంగి రోడ్డులో ఉంటూ గుండుబోయిన రామకృష్ణ అనే తాపీ మే స్త్రీ వద్ద పని చేస్తున్నాడు. సోమవారం ఉదయం యధావిధిగా ఏలూరు మినీ బైపాస్ రోడ్డులోని ఒక భవన నిర్మాణ పనికి వెళ్ళాడు. అక్కడ బిల్డింగ్ పై నుంచి ప్రమాదవశాత్తు వెంకటేశ్వరరావు జారి పడ్డాడు. తోటి కార్మికులు వెంటనే అతనిని ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్ళారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆస్పత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

రైలు నుంచి దిగుతూ ఒకరి మృతి

ఏలూరు క్రైం, సెప్టెంబర్ 2 : రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నెమ్మదిగా వెళ్తతూ ఉండడంతో ఆ రైలు అక్కడ ఆగ దేమోనని దిగడానికి ప్రయత్నిస్తూ ఆ రైలు కిందే పడి తీవ్ర గాయాలకు గురై మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా కాజీపేటకు చెందిన తిప్పాని వీరభద్రుడు (50) ఫోటో గ్రాఫర్‌గా పనిచేస్తున్నాడు. ఏలూరులో ఉన్న బంధువుల ఇంటికి రావడానికి ఈ నెల ఒకటో తేదీన రైలు ఎక్కాడు. ఆ రైలు గుడివాడ, కైకలూరు, భీమవరం టౌన్, నిడదవోలు మీదుగా దారి మళ్ళించారు. బంధువులకు ఫోన్ చేయగా ఆ రైలు కైకలూరులో ఆగుతుందని అక్కడ దిగితే తాము వస్తామని చెప్పారు. అర్థరాత్రి ఆ రైలు కైకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో నెమ్మదిగా వెళ్తుంది. రైలు ఆగదేమో అనుకుని నెమ్మదిగా వెళ్తుంది కదా అని వీరభద్రుడు కిందకు దూకేశాడు. దీంతో రైలు ప్లాట్ ఫాంకు, రైలుకు మధ్యలో పడి కాలు తెగిపోయింది. రైలు ఆగింది. అయితే అప్పటికే బంధువులు కారు వేసుకుని అతనికి కోసం ఎదురు చూస్తున్నారు. రైలు కింద పడి కాలు కోల్పోయిన అతనిని వెంటనే ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై భీమవరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహానికి ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం జరిపి బంధువులకు అప్పగించారు.

వ్యభిచార గృహం నిర్వాహకురాలికి జైలు శిక్ష

ఏలూరు క్రైం/భీమవరం క్రైం, సెప్టెంబర్ 2 : వ్యభిచార గృహం నిర్వహిస్తున్నట్లు ఒక మహిళపై నేరం రుజువు కావడంతో ఐదేళ్ల జైలు శిక్ష, నాలుగు వేల రూపాయల జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి జి.రాజేశ్వరి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం భీమవరం పట్టణంలోని గునుపూడి ప్రాంతంలో ప్రగడ సాయికుమారి తన ఇంట్లో 2020లో కొంత మంది యువతులతో వ్యభిచారం నిర్వహిస్తుంది. ఈ సమాచారం అప్పటి వన్‌టౌన్ పోలీసులకు అందడంతో అప్పటి సీఐ కృష్ణభగవాన్ దాడి చేసి ఆమెపై ఐటీపీ యాక్టు కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. కోర్టులో ఛార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసు ఏలూరులోని 5వ అదనపు సెషన్స్ కోర్టులో విచారణ సాగింది. ప్రధాన నిందితురాలైన ప్రగడ సాయికుమారిపై నేరం రుజువు కావడంతో ఐదు సంవత్సరాలు జైలు శిక్ష, నాలుగు వేల రూపాయలు జరిమానా విధిస్తూ జడ్జి రాజేశ్వరి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున డీవీ రామాంజనేయులు వాదించగా ప్రాసిక్యూషన్‌కు భీమవరం వన్‌టౌన్ సీఐ నాగరాజు, కోర్టు కానిస్టేబుల్ శ్రీనివాస్ సహకరించారు.

బంగారం, వెండి చోరీ

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 2: తాడేపల్లిగూడెం పట్టణంలోని ఓ ఇంటి తలుపులు పగలగొట్టి దుండగులు చోరీకి పాల్పడిన ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గాయత్రీదేవి ఆలయం సమీపంలో నివాసముంటున్న గోపి విజయలక్ష్మి తన కుమారుడు ఇంటికి వెళ్లేందుకు తన ఇంటికి తాళం వేసి వెళ్లారు. అయితే సోమ వారం ఉదయం తిరిగి వచ్చేసరికి తాళాలు పగలగొట్టినట్టు గుర్తించి లోపలికి వెళ్లి చూసే సరికి పది కాసుల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండి, రూ.30 వేల నగదు దోచుకున్నట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నాగరాజు తెలిపారు.

హత్య కేసు వేగంగా దర్యాప్తు : సీఐ

భీమవరం క్రైం, సెప్టెంబరు 2 : స్థానిక 38వ వార్డు లంకపేట సమీపంలో ఆదివారం రాత్రి ఇద్దరి మధ్య నగదు విషయంలో జరిగిన ఘర్షణలో సైకం నాగరాజు అనే వ్యక్తి మృతి చెందగా ఆకుల తులసీవరప్రసాద్ (నాని) తీవ్రంగా గాయపడి ప్రస్తుతం కోమాలో ఉన్నట్లు టూటౌన్ సీఐ జి.కాళీచరణ్ తెలిపారు. అయితే అతను ప్రస్తుతం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో ఉన్నట్లు తెలిపారు. వీరిద్దరి మధ్య నగదు విషయంలో తగాదా జరిగినట్టు నిర్ధారణ అయ్యిందన్నారు. సీసీ ఫుటేజీ ఆధారంగా పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. కొందరు క్షణికావేశంలో ఇలాంటి తప్పులు చేసి జీవితాంతం బాధపడుతున్నారని ఎవరైనా ఒకసారి ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సిఐ కోరారు.



నిరసన తెలుపుతున్న విద్యుత్ మీటర్ రీడర్లు

విద్యుత్ మీటరు రీడర్ల ఆందోళన

భీమవరం అర్బన్, సెప్టెంబరు 2: విద్యుత్ మీటర్ రీడర్ల వేతనాలు ఎస్క్రో అకౌంట్స్ ద్వారా చెల్లించాలని, లేని పక్షంలో ఎస్క్రో అకౌంట్స్ ఓపెన్ చేసే వరకు విద్యుత్ మీటరు రీడర్స్ రీడింగ్ తీయకుండా విధులు బహిష్కరించనున్నట్లు ఏఐటీయుసీ జిల్లా అధ్యక్షుడు కోనాల భీమారావు అన్నారు అన్నారు. సోమవారం విద్యుత్ శాక భీమవరం డివిజన్ కార్యాలయంలో విద్యుత్ శాక డీవిజన్ ఏడీఈకు వినతిపత్రం సమర్పించారు. కాంట్రాక్టర్లు రీడర్సుకు చెల్లించే వేతనాల్లో అవినీతికి పాల్పడుతున్నారన్నారు. ఏఐటీయుసీ నాయకులు సీతారాం ప్రసాద్, యూనియన్ నాయకులు వేమవరపు శ్రీనివాస్, నరసింహ, బాలాజీ , లక్ష్మణమూర్తి, లోవరాజు, జయబాబు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు, నివాసితులు

కార్మికనగర్ వాసుల ఆందోళన

ఆకివీడు, సెప్టెంబరు 2 : కాలుష్యం పేరుతో నివాసితుల ఇళ్ళను తొలగిస్తాననడం సబబు కాదని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం, సెక్రటేరియేట్ సభ్యులు జేఎన్వీ గోపాలన్ అన్నారు. అయి-భీమవరం రోడ్‌లోని కార్మికనగర్ నివాసితులతో కలిసి నిరసనలు తెలిపారు. రొయ్యిలు, చేపల చెరువులతో పాటు సంస్థలు, పరిశ్రమల నీటిని పంట కాల్వలోకి వదిలేయడంతోనే కాలుష్యం ఏర్పడుతుందన్నారు. కె.తవిటినాయుడు, పెంకి అప్పారావు, డోకల లక్ష్మి, సందక ఉదయకుమారి,సూరిబాబు, బి.వర్మ, బి.రాంబాబు, గేదెల ధనుష్, యర్రా కృష్ణవేణి, లింగాల బలరాం, ప్రసాద్, ఏసు, సావిత్రి, దుర్గారావు, సావిత్రి, కె. రాంబాబు తదితరులు ఉన్నారు.

రోడ్డు వేయాలంటూ సీపీఎం నిరసన

భీమవరం రూరల్, సెప్టెంబరు 2 :గోతులు పూడ్చి రోడ్డు వేయాలని సీపీఎం పార్టీ మండల కన్వీనర్ ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. సోమవారం భీమవరం రూరల్ మండలం వెంపలో బస్టాండ్ సెంటర్ పెట్రోల్ బంక్ దగ్గర ఆర్అండ్‌బీ రోడ్డు గోతులు పడటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వాహనాలు పాడైపోతున్నాయని, ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంప పెంట్రోల్‌బంక్ దగ్గర నుంచి పెదగరువు దాకా గోతులు పూడ్చి రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఈద భూషణం, బల్ల ఏమిలియా, బొబ్బనపల్లి వర్ధనపు ప్రసాద్, మంద యాకోబు పాల్గొన్నారు.

ఎంపీటీసీ ఇంటిపై దాడి హేయమైన చర్య



యలమంచిలి, సెప్టెంబరు 2: యలమంచిలిలో టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు చిలుకూరి రాజ్యలక్ష్మి శ్రీనివాస్ ఇంటిపై ఇటీవల అర్ధరాత్రి జరిగిన దాడి హేయమైన చర్య అని టీడీపీ మండల అధ్యక్షుడు మామిడిశెట్టి పెద్దిరాజు అన్నారు. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులతో కలిసి పెద్దిరాజు దాడి జరిగిన ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజాప్రతినిధి ఇంటిపై రాయి విసిరిన అగంతకులను పోలీసులు గుర్తించి వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బోనం నాని, బొప్పన సుజాత, హరికిషోర్, కడలి గోపి, మాతా రత్నంరాజు, ముచ్చర్ల శ్రీనివాస్, చెరుకూరి అంజిబాబు, చిలుకూరి బాలాజీ, చిట్టూరి ఆంజనేయులు, పీతల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల ప్రదేశ్‌లో కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ



భీమవరం టౌన్, సెప్టెంబరు 2 : అరుణాచల ప్రదేశ్‌లో కేంద్ర ఉక్కు, భారీపరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ పర్యటించారు. ముఖ్యమంత్రి పెమా ఖండును మర్యాదపూర్వకంగా కలిశారు. పరిశ్రమల ఏర్పాటుపై తమ శాఖ తర పున పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. చైనా, టిబెట్‌కు దగ్గరగా ఉన్న దేశం మొదటి గ్రామంలో పర్యటించారు. అక్కడ ఉన్న గౌతమ బుద్ధుని మందిరాన్ని సందర్శించారని బీజేపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.



డ్రైన్‌ల మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ రాహుల్ కుమార్ రెడ్డి

డ్రైన్‌లు, కాల్వగట్ల పటిష్టతకు నిరంతర పర్యవేక్షణ

భీమవరంటౌన్, సెప్టెంబర్ 2 : డ్రైన్లు, కాలవ గట్ల పటిష్టతపై నిరంతర పర్యవేక్షణ చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. వర్షాల కారణంగా పొంచి ఉన్న ముప్పును సంవర్ధవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నందమూరి ఆక్విడెక్ట్, ఎర్రకాలువ, యనమదుర్రు డ్రైన్, భీమవరం పట్టణంలోని బైపాస్ వద్ద యనమదుర్రు డ్రైన్, మెంటే వారి తోట ప్రాంతాలలో పర్యటించారు. ఎప్పటికప్పుడు గట్ల పటిష్టతపై తప్పకుండా పర్యవేక్షణ చేయాలన్నారు.రానున్న మూడు, నాలుగు రోజుల్లో మరో అల్పపీడనం ఏర్పడనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గోదావరి వెస్ట్రన్ డివిజన్ నిడదవోలు ఈఈ దక్షిణామూర్తి, ఇరిగేషన్ డిఈలు సత్యదేవ్, ఏ.రవీంద్ర బాబు, ఏఈ వెంకటేశ్వరరావు, జేఈలు కిరణ్, పెద్దిరెడ్డి, భీమవరం మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, మునిసిపల్ డీఈ త్రినాధరావు, ఇరిగేషన్, వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు ఉన్నారు.



ఎల్ఐసీ వార్షికోత్సవాలు

పాలకొల్లు సెప్టెంబరు 2: జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) ఆవిర్భవించి 68 ఏళ్ళు పూర్తి అయిన సందర్భంగా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్టు బ్రాంచి మేనేజర్ రఘు కుమార్ తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. 5వ తేదీ గురుపూజోత్సవం జరుపుతామన్నారు. ఈ సందర్భంగా డవలప్ మెంట్ ఆఫీసర్లను సత్కరించారు. కార్యాలయ సిబ్బంది, ఏజెంట్లు, పాలసీ దారులు పాల్గొన్నారు.

పంచారామాల్లో ప్రత్యేక అభిషేకాలు



పాలకొల్లుఅర్బన్, భీమవరం టౌన్, సెప్టెంబరు 2 : క్షీరా రామలింగేశ్వర స్వామి వారికి సోమవారం సంద ర్భంగా ప్రత్యేకంగా ఏకవార, రుద్రాభి షేకాలు నిర్వహించారు. సాయంత్రం పంచ హారతులు ఇచ్చి ప్రత్యేకంగా అలంకరించారు. గునుపూడిలోని పంచారామ క్షేత్రమైన సోమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకారం చేశారు. ఆలయ అర్చకుడు కందుకూరి సోంబాబు, చెరుకూరి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు.









భీమవరం అన్నసమారాధలో ఎమ్మెల్యే అంజిబాబు.. గణపవరంలో హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు..నరసాపురంలో బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే నాయకర్..అర్జునుడుపాలెంలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి

ఘనంగా పవన్ కల్యాణ్ పుట్టినరోజు వేడుకలు

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలను కూటమి నాయకులు, అభిమానులు సోమవారం ఘనంగా నిర్వహించారు.పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కేక్‌లు కట్ చేశారు. పలు చోట్ల అన్నసమారాధనలు జరిగాయి.రక్తదాన శిబిరాలు, వైద్య శిబిరాలు నిర్వహించారు.

భీమవరం టౌన్ : జనసేన పార్టీ రాష్ట్ర ప్రోటో కాల్ చైర్మన్ మల్లినీడి తిరుమలరావు (బాబి) ఆధ్వర్యంలో ప్రకాశం చౌక్ సెంటర్లో అన్నదానం నిర్వహించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు ప్రారంభించారు. వెయ్యి మందికి పైగా పేదలు పాల్గొని భోజనం స్వీకరించారు. యిర్రింకి సూర్యారావు, కోళ్ల నాగేశ్వరరావు, వేగేశ్న కనకరాజుసూరి, భీమాల శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. జనసేన నాయకుడు భీమలా శ్రీరామమూర్తి సౌజన్యంతో 27వ వార్డులోని కొక్కిరి నాగమణి అనే దివ్యాంగురాలికి ట్రైసైకిల్ అందజేసారు. పట్టణంలోని ముగ్గురు పేద విద్యార్థులకు దాతల సహకారంతో రూ.30 వేలు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

భీమవరం రూరల్ : వెంపలో కలిదిండి బంగార్రాజు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. బేతపూడి, తుందుర్రు, తాడేరు, గొల్లవానితిప్ప గ్రామాల్లో కేక్ కట్ చేయడంతో పాటు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. అభిమానులు ర్యాలీలు నిర్వహించారు.

భీమవరం అర్బన్ : పట్టణ టీడీపీ నాయకులు గంటా త్రిమూర్తులు, మద్దుల రాము ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో వృద్ధులకు భోజనాలు అందించారు. టీడీపీ రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారధి కేక్ కట్ చేశారు. మైలబత్తుల ఐజాక్‌బాబు, ఏసుపాదం, ఎలమంచిలి శ్రీను, బ్రహ్మాజీ, పడమట నరసింహమూర్తి, మాత సురేష్, కిలాని ప్రసాదు, తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడు : టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి జుత్తుగ నాగరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నం టీడీపీ, జనసేన కార్యాలయాల్లో సోమవారం కేక్ కట్‌చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో నాగరాజు మొక్కలు నాటారు. మాదివాడ యువత, సాలిపేట జనసైనికులు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు, అన్నదానాలు నిర్వహించారు. టీడీపీ,జనసేన మండల-పట్టణ అధ్యక్షుడు మోటుపల్లి రామవర ప్రసాద్, బాలాజీ,బొల్లా వెంకట్రావు, పిల్లా బాబులు, గొంట్లా గణపతి, తదితరులు ఉన్నారు.

పాలకోడేరు : పాలకోడేరులో జనసేన పార్టీ గ్రామ అధ్యక్షుడు కడిమి కల్యాణ్‌బాబు ఆధ్వర్యంలో ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజు రక్తదాన శిబిరం, వృద్ధులకు దుస్తుల పంపిణీ చేశారు. మొక్కలు నాటారు. మండల అధ్యక్షుడు గాదం నానాజీ, వలవల శేష, ఆకుల సత్యనారాయణ, సిరిగినీడి శ్రీనివాస్, శ్రీరాములు శ్రీనివాస్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

కాళ్ళ: పెదఅమిరంలో ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, జనసేన ఉండి ఇన్‌చార్జీ జుత్తిగ నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు, జనసేన పీఏసి సభ్యులు వేగేశ్న కనకరాజు సూరి, డీసీసీబీ మాజీ చైర్మన్ ముత్యాల రత్నంలు కేక్ కట్ చేశారు. నూతనంగా ఏర్పాటు చేసిన జెండా స్థూపాన్ని ప్రారంభించి, మొక్కలు నాటారు. సర్పంచ్ డొక్కు సోమేశ్వరరావ, బీజేపీ ఉండి కన్వీనర్ కోరా రామ్మూర్తి, ఉపసర్పంచ్ జవ్వాది కిషోర్, మండలాధ్యక్షుడు ఎరుబండి రామాజనేయులు,సాగిరాజు అప్పలరాజు, జయరామ్, కిషోర్, అనిల్, జనసేన, బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు. రక్తదాన శిబిరాల్లో యువకులు రక్తదానం చేశారు. ఏలూరుపాడు గ్రామంలో రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకునికి రూ.47,000 ఆర్థిక సాయం చేశారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందించారు. కోపల్లె గ్రామంలో పేదలకు అన్నదానం నిర్వహించారు.

ఆచంట: ఆచంట కచేరి సెంటర్‌లో అన్నసమారాధన నిర్వహించారు. సుమారు 5 వేల మంది పాల్గొన్నారు. ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్,



సిద్ధాంతంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న పితాని వెంకట్

ఎంపీపీ దిగుమర్తి సూర్యకుమారి, గొడవర్తి శ్రీరాములు, మీరయ్య జవ్వాది బాలాజీ, మండేల శ్రీనివాస్, వైస్ ఎంపీపీలు నాగరాజు, తాళం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి, ఎంపీడీవో నరసింహ ప్రసాద్, కూటమి సభ్యులు పాల్గొన్నారు.

యలమంచిలి: మేడపాడు, యలమంచిలి, చించినాడ, అడవిపాలెం, ఏనుగు వానిలంక, బాడవ తదితర గ్రామాల్లో జనసేన, టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. బాణసంచా కాల్చారు.గ్రామాల్లో మొక్కలు నాటారు.కొడవటి వరబాబు, బర్రే ప్రసాద్, కొప్పిశెట్టి నాగరాజు (నాని), ఆకుమర్తి సురేష్, మామిడిశెట్టి పెద్దిరాజు, బోనం నాని, చల్లా నరేంద్రకుమార్, ఇనుకొండ రమేష్, కాసా నాగ రాజు తదితరులు పాల్గొన్నారు. బాడవలో మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు, సినీ నిర్మాత బన్నీవాసులు పాల్గొని కేక్ కట్ చేశారు

నరసాపురం టౌన్ : పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే నాయకర్ భారీ కేక్ కట్ చేశారు. భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. చిన్న కనకదుర్గా ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. సరిపల్లి రామాలయం వద్ద అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్నలు కట్ చేశారు. సుమారు 100 మంది పేదలకు నిత్యవసరాలు, చీరలను పంపిణీ చేశారు. మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎన్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన కేక్ కట్ చేశారు. చినమిల్లి సత్యనారాయణ, ఈదా సురేష్, కోటిపల్లి వెంకటేశ్వరావు, కొండ తదితరులు పాల్గొన్నారు.

మొగల్తూరు : కెపిపాలెం, కోమటితిప్ప గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, డాక్టర్ ఇలపకుర్తి ప్రకాష్‌లు, మేకల సతీష్‌లు జన్మదిన కేక్‌లు కట్ చేయగా రామన్నపాలెంలో ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ కేక్ కట్ చేశారు. శేరేపాలెంలో పవన్ కళ్యాణ్ అభిమానులు రక్తదానం చేశారు. శిబిరాన్ని ఎస్ఐ జి.వాసు ప్రారంభించగా సుమారు 25 మంది రక్తదానం చేశారు. మొగల్తూరులోని చిరంజీవి శాఖా గ్రంథాలయం వద్ద పవన్ అభిమానులు, జనసేన కార్యకర్తలు మొక్కలు నాటారు.

గణపవరం:గణపవరంలో బాలికల హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పంపిణీ చేశారు. పిప్పరలో కేక్ కట్ చేశారు. కోమర్రులో మొక్కలు నాటారు. మొయ్యేరులో ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు కట్ చేశారు. ఇందుకూరి రామకృష్ణరాజు, యాళ్ళ సుబ్బారావు, కానుమిల్లి చంటి, జనసేన నాయకులు తోట శ్రీనివాసరావు, కొలనువాడ శ్రీనివాసరాజు, తోట పవన్, తదితరులు పాల్గొన్నారు.

పెనుమంత్ర : మార్టేరులో 500 వినాయకుని మట్టి ప్రతిమలు పితాని వెంకట్ పంపిణీ చేశారు. మార్టేరుకు చెందిన నల్లి వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందడంతో కుటుంబ సభ్యులకు 25 వేల రూపాయల చెక్కును అందజేశారు. టీడీపీ అధ్యక్షుడు గంట వాసు ఆధ్వర్యంలో పీహెచ్‌సీలో రోగులకు పాలు, రొట్టె పంపిణీ చేశారు.

ఉండి : ఉండి పెద్దవంతెన సెంటర్‌లో మండల జనసేన కన్వీనరు యడవల్లి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.వెలివర్రులో పొత్తూరి వెంకటేశ్వరరాజు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

తాడేపల్లిగూడెం అర్బన్ :పట్టణంలో ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. జన సైనికులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేశారు. మొత్తం 900 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. దీంతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సొంతమైంది. బొలిశెట్టి తన యుడు రాజేష్ తెలుగు బుక్ ఆఫ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి, పట్నాల రాంపండు, పుల్లా బాబి, అడబాల నారాయణ, సురగాల రాంబాబు పాల్గొన్నారు

పెంటపాడు : పెంటపాడులో జనసేన నాయకుడు కొవ్వూరి లక్ష్మణరెడ్డి కేకును కట్ చేసి చిన్నారులకు పంచారు. పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఒలిరెడ్డి వరప్రసాద్, జన సైనికులు పాల్గొన్నారు.

అత్తిలి: తిరుపతిపురంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ హాజరై కేకు కట్ చేశారు. రోడ్డు వెంబడి మొక్కలు నాటారు.అత్తిలి బస్‌స్టేషన్ సెంటర్‌లో జనసేన మండల అధ్యక్షుడు దానం ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వ హించిన వేడుకల్లో, అత్తిలి జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి హాజరయ్యారు.

ఇరగవరం : మండలంలోని కె.ఇల్లిందలపర్రు, ఇరగవరం, తూర్పు విప్పర్రు, కొత్తపాడు, అర్జునుడుపాలెం, కాకిలేరు గ్రామాలలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ పాల్గొని కేకును కట్ చేశారు. అర్జునుడుపాలెంలో మొక్కలు నాటారు. తూర్పు విప్పర్రులో అన్న సమారాధన నిర్వహించారు. కాకిలేరులో రక్తదాన శిబిరం నిర్వహించారు.

పాలకొల్లు అర్బన్/పాలకొల్లు రూరల్: మండలంలోని పెదమామిడిపల్లిలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. వృద్ధ మహిళకు 25కిలోల బియ్యం, దుస్తులు, రూ. 516లు నగదు అందించారు. పట్టణంలో అభిమానులు రక్తదాన శిబిరం నిర్వహించారు.









ఆకివీడులో మహిళలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామరాజు.. కేపీ పాలెంలో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు..రక్తదాన శిబిరాన్ని సందర్శించిన వలవల బాబ్జి, బొలిశెట్టి రాజేష్..పెదఅమిరంలో జెండా స్థూపాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే రాఘురామ

నరసాపురం కమిషనర్‌గా అంజయ్య బాధ్యతలు



నరసాపురం, సెప్టెంబరు 2: నరసాపురం పుర పాలక కమిషనర్‌గా అంజయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పుట్టపర్తి నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన వెంకటేశ్వర్లు ఒంగోలు కార్పోరేషన్ బదిలీపై వెళ్లారు. డీఈ రమేష్, మేనేజర్ నిర్మలకుమారి, ఆర్వి నానాజీ, ఏఈలు సునీల్, మణి, ఆర్వో రామారావు, ఆరుణకుమారిలు అభినందించారు.

నేడు సాయంత్రం నీటి సరఫరా నిలిపివేత

నరసాపురం టౌన్, సెప్టెంబరు 2: మునిసిపల్ హెడ్ వర్క్స్‌లో క్లీనింగ్ పనుల కారణంగా మంగళవారం సాయంత్రం నీటి సరఫరా ఉండదని కమిషనర్ అంజయ్య తెలిపారు. తిరిగి బుధవారం ఉదయం సరఫరా జరుగు తుందన్నారు. ప్రజలు మంచినీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

తాడేపల్లిగూడెం రూరల్, సెప్టెంబరు 2: తాడేపల్లిగూడెంలోని 33 కేవీ సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం మంగళవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్టు ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు. హౌసింగ్ బోర్డు, పాతూరు, కొండయ్యచెరువు సబ్‌స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాలతో పాటు మోదుగగుంట, గొల్లగూడెం, అప్పారావుపేట, కుంచనపల్లి, మెట్ట ఉప్పరగూడెం, ఇటుకల గుంట, అమృతపురం, వెంకట్రావుపాలెం, టిడ్కో సబ్‌స్టేషన్, అగ్రహారం, కొండ్రుప్రోలు, కేఎస్ఎన్ కాలనీల వినియోగదారులు సహకరించాలని కోరారు.

ముంపు ప్రాంతాల్లో శాస్త్రవేత్తల పర్యటన

నరసాపురం రూరల్, సెప్టెంబరు 2 : ముంపుకు గురైన పంట పొలాలను సోమవారం మార్టేరు వ్యవసాయ పరిశోధన సంస్థకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ కృష్ణాజి, డాక్టర్ భువనేశ్వరి, డాక్టర్ రోజా పర్యటించారు. మండలంలోని రుస్తుంబాదా ప్రాంతంలో పొలాలను పరిశీలించారు. ఏడీఈ అనిల్‌కుమారి,ఏవో జాన్సన్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

తణుకు : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి.వెంకటేశ్వరరావు అన్నారు. సోమవారం పట్టణంలోని చాకలి చెర్వు ఏరియాలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.

ఎస్కేఎస్డీ మహిళా కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం క్లీన్ క్యాంపస్-గ్రీన్ క్యాంపస్ కార్యక్రమం చేపట్టారు. కళాశాల పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ లక్ష్మీసుందరీబాయ్, కళాశాల కార్యదర్శి ఉషారాణి, శ్యామలాదేవి, రమేష్‌బాబు పాల్గొన్నారు.

మొగల్తూరు : ఇటీవల పితృ వియోగం చెందిన మండల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల నాగరాజును సోమవారం మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామరాజు పరామర్శించారు. మొగల్తూరులో ఇటీవల మృతి చెందిన అనంతపల్లి రాజ్యలక్ష్మీ కుటుంబ సభ్యులను మాధవనాయుడు పరామర్శించారు.

తాడేపల్లిగూడెం అర్బన్ : జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు రామ్ అతని సోదరుడు లక్ష్మణ్ జన్మదిన వేడుకలను సోమవారం పార్టీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వలవల బాబ్జి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి, రామ్‌లక్ష్మణ్‌లను సత్కరించారు.

నరసాపురం రూరల్ : మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామంలో పారిశుధ్య పనుల్ని మెరుగుపర్చాలని సీపీఎం డిమాండ్ చేసింది. సోమవారం మండల స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ప్రజలకు సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

మండలంలోని మల్లవరం లంక గ్రామంలో అంబేడ్కర్ ఫ్లెక్సీ వద్ద మరో పార్టీకి చెందిన ఫెక్సీని ఏర్పాటు చేయడంపై దళిత సంఘ నాయకులు కాకిలేటి ఆనంద్‌తో పాటు మరికొంతమంది మండిపడ్డారు. ఫ్లెక్సిని తొలగించాలని డిమాండ్ చేశారు.విషయం పోలీసులకు తెలియడంతో ఇరువురికి నచ్చజెప్పారు.

భీమవరం టౌన్ : అమావాస్య పురస్కరించుకుని మెంటే వారి తోటలోని బాలా త్రిపుర సుందరీ అమ్మవారికి భక్తుల సహకారంతో కందతో అలంకారంచేసారు.పొలాల అమావాస్యను పురస్కరించుకుని అలంకారం చేశారు. ఉదయం అమ్మవారికి ఆలయ అర్చకుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభిషేకాలు చేశారు

విజయవాడ, రాజమండ్రిలో రోగులకు పెన్షన్లు అందజేత

పాలకొల్లు రూరల్, సెప్టెంబరు 2: నాగరాజు పేటకు చెందిన కస్తూరి వెంకట సత్య నాగేశ్వరతులసీ ప్రసాద్ అస్వస్థతతో విజయవాడలోని ఎస్ఆర్ఐ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అతనికి ఎన్‌టీఆర్ భరోసా నెలవారి పెన్షన్ పాలకొల్లు రూరల్ పంచాయతీ కార్యదర్శి వేదాల పవన్ సోమవారం విజయవాడ తీసుకువెళ్లి అందజేశారు. అలాగే దగ్గులూరుకు చెందిన మెట్టపల్లి సత్యనారాయణ మూర్తి రాజమండ్రి బొల్లినేని ఆసుపత్రిలో ఆపరేషన్ చేయించుకున్నాడు అతనికి సచివాల ఉద్యోగి చైతన్య, మండల పరిషత్ ప్రతిపక్ష నేత సత్యనారాయణ రాజమండ్రి తీసుకువెళ్ళి పెన్షన్ అందజేశారు.



ఆకివీడు మెయిన్ సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి మాట్లాడుతున్న మాజీ ఎంపీ బాపిరాజు తదితరులు

వైఎస్‌కు ఘన నివాళులు

ఆకివీడు/ కాళ్ళ/ భీమవరం అర్బన్/ ఆచంట/ మొగల్తూరు/ నరసాపురం టౌన్/ పాలకొల్లు అర్బన్/ పెనుమంత్ర సెప్టెంబరు 2 : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా వైసీపీ, కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలకు పూలమాలల వేసి నివాళులర్పించారు. ఆకివీడు వైఎస్ఆర్ సెంటర్‌లో మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, జామి హైమావతి, పుప్పాల పండు, కేశిరెడ్డి మురళీ, జ్యోతిరెడ్డి తదితరు పాల్గొని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాళ్ల మండలం పెదఅమిరం గ్రామంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, పాతపాటి శ్రీనివాసరాజులు పాల్గొని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పచ్చిగోళ్ళ సోమేశ్వరరావు, వేగేశ్న జయరామకృష్ణంరాజు, పెన్మెత్స దుర్గాప్రసాదరాజు, విశ్వనాథరాజు, సాగిరాజు హరివర్మ, జవ్వాది సత్యనారాయణ, గణేశ్న రాంబాబు, తదితరులు పాల్గొన్నారు. భీమవరంలో వైఎస్ఆర్ విగ్రహానికి భీమవరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అంకెం సీతారాం నివాళులర్పించారు. కాంగ్రెసు నాయకులు మద్దాల సాయి కుమార్, బోనం రవికుమార్, రామరాజు, మేడపాటి సాగర్, సత్యశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఆచంటలో వైట్ల కిషోర్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూల మాలలు వేశారు. రోగులకు, వృద్ధులకు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. తూర్పుపాలెం మాజీ ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాధరాజు క్యాంప్ కార్యాలయం వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. సర్పంచ్‌లు సుంకర సీతారామ్, జక్కంశెట్టి చంటి, వెంకటేశ్వరరావు, రామచంద్రరావు పాల్గొన్నారు. మొగల్తూరు రామాలయం సెంటర్, కోట వద్ద వైఎస్ఆర్ విగ్రహాలకు జడ్పీటీసీ తిరుమాని బాపూజీ పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుక్కల కృష్ణమోహన్, పడవల సత్యనారాయణ, గుబ్బల నారాయణ మూర్తి, రేవు రాంబాబు, గణపతి, ఆదాము, పెద్దిరాజు పాల్గొన్నారు. నరసాపురంలో మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు, పార్టీ శ్రేణులు పార్టీ కార్యాలయం నుంచి బయలుదేరి స్టీమర్‌రోడ్‌లోని వైఎస్ విగ్రహం వరకు ర్యాలీ బయలుదేరి నివాళులర్పించారు. చైర్‌పర్సన్ వెంకట రమణ, పీడీ రాజు, షేక్ బుల్లిమస్తాన్, పాల్గొన్నారు. పాలకొల్లులో పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నియోజక వర్గ ఇన్‌చార్జీ కొలుకులూరి అర్జునరావు, పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ, నాయకులు పాల్గొన్నారు. మేకా శేషుబాబు పూలపల్లి జైజంక్షన్ లోని వైఎస్ఆర్ విగ్రహానికి నివాళర్పించారు. అనంతరం మహిళలు చీరలు, పంపిణీ, పేదలకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. గుడాల గోపి, నాయకులు యడ్ల తాతాజీ, పలువురు నాయకులు పాల్గొన్నారు. మార్టేరు సెంటర్‌లో వైఎస్ విగ్రహానికి కర్రీ గౌరీ సుభాషిని నివాళులర్పించారు. అల్లం బుల్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ మట్టా కుమారి రాము, వేణుబాబు, భాస్కర్ రెడ్డి, సాయిబాబా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాల కోసం 60 ఎకరాలు

భీమవరం ఎడ్యుకేషన్, సెప్టెంబరు 2 : ప్రభుత్వ కార్యాలయాలు ఒకే చోట ఉండేలా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో చర్చించి 60 ఎకరాలను సేకరిస్తామని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు తెలిపారు. సోమవారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వం జిల్లా కలెక్టరేట్‌ను మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేస్తామని జీవో తీసుకువచ్చిందని దాన్ని రద్దు చేసి 60 ఎకరాలలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకేచోట ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలనుకుంటున్నామన్నారు. భీమవరం, వీరవాసరం మండలాలలో సాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని, నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైయిన్‌లు వేయడంతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. జనసేన జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, చెనమల్ల చంద్రశేఖర్, కోళ్ళ నాగేశ్వరావు, బండి రమేష్‌కుమార్ పాల్గొన్నారు.



మొయ్యేరులో నీటి ముంపునకు గురైన వరిచేలు పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం : గన్ని


గణపవరం, సెప్టెంబరు 2: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గణపవరం మండలం పిప్పర, మొయ్యేరు గ్రామాల ఆయకట్టు పరిధిలోని ముంపునకు గురైన పొలాలను ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు సోమవారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించారు. పిప్పరలోని బాడవాయుకట్టులో గత యనమదుర్రు వరదలకు మునిపోయిన పొలాలను రెండోసారి నాట్లు వేసిన పొలాలు తిరిగి ముంపునకు గురయ్యాయని రైతుల వీరాంజనేయులు దృష్టికి తీసుకెళ్ళారు. సుమారు బాడవాలో వంద ఎకరాలు, మొయ్యేరు పరిధిలోని 300 ఎకరాలు వరి చేలు మునిగిపోయాయి. పిప్పర రెవెన్యూ పరిధిలో ఇరిగేషన్ డ్రైన్లు కూడా పూడుకుపోవడంతో ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి పూడిక తొలగించి రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని కలెక్టర్ ఫోన్‌లో గన్ని కోరారు.

వరిచేలను పరిశీలించిన టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ



భీమవరం అర్బన్, సెప్టెంబరు 2 : వర్షా కారణంగా నీటి మునిగిన వరి పోలాలను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు పరిశీలించారు. రైతులను ఆదుకుంటారని రైతులకు భరోసా కల్పించారు.పార్టీ నాయకులు మల్లుల శ్రీధర్, నడింపల్లి శ్రీనివాసరాజు, విజ్జొరోతు రాఘువులు, బోడపాటి బాబురావు, రెడ్డి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

పని చేసే నాయకులకు పార్టీలో గుర్తింపు



నరసాపురం టౌన్, సెప్టెంబరు 2: కష్టపడి పని చేసే నాయకులకు ఎప్పుడు గుర్తింపు ఉంటుందని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషి చేసిన పెమ్మాడి శ్రీదేవి, మౌలాలీ, జక్కం వెంకయ్య, జక్కంశెట్టి బాలాజీలకు పార్టీ తరుఫున ప్రశంసా పత్రాలందించారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ పార్టీ బలపర్చిన అభ్యర్థులకు ఇదే రీతిలో పని చేయాలన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకల్ని పురస్కరించుకుని కేక్ కట్ చేశారు. జక్కం శ్రీమన్నారాయణ, కొప్పాడ రవి, కొల్లు పెద్దిరాజు, అధికారి అనంత రామారావు, వాతాడి ఉమా, పాపారావు, హుసేన్‌లు పాల్గొన్నారు.